వేసవిలో నీటి ఇబ్బందులు ఉండొద్దు

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

గన్నేరువరం: వేసవిలో గ్రామాల్లోని ప్రజలకు నీటి ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులను సూచించారు. గన్నేరువరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లింగాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్యసమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ, రెవెన్యూ, మిషన్ భగీరథ, పౌర సరఫరాలు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ, పంచాయతీరాజ్‌శాఖల్లో ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు వేసవిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఆరు గ్యారంటీ పథకాలు అర్హులైన వారికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గుండ్లపల్లి నుంచి రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి పోరాటం చేస్తే గత ప్రభుత్వం రూ.70 కోట్ల నిధులతో జీవోతో శంకుస్థాపన చేశారే తప్పా పనులను ప్రారంభించలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారి సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆర్థికశాఖ నుంచి అనుమతులు తీసుకువచ్చి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో సాగునీటి సమస్యలు, కాల్వల పరిస్థితిపై ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. మండలంలో ప్రభుత్వం ఆరోగ్యకేంద్రం, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తామని తెలిపారు.

అంగన్‌వాడీలను బలోపేతం చేస్తాం

పిల్లలు, తల్లులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మండల పరిషత్‌లో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఖాళీల పోస్టులను త్వరలోనే ప్రభుత్వం భర్తీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో శంకర్, ఎస్సై నరేశ్, ఏవో కిరణ్మయి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

నెల రోజులుగా మండల కేంద్రంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో బాహుపేట - మాదాపూర్ గ్రామాలు పోటీపడగా బాహుపేట విన్నర్‌గా నిలిచింది. విన్నర్ జట్టుకు రూ.20 వేల బహుమతిని యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, రన్నర్ జట్టుకు రూ.10 వేల బహుమతిని డీసీసీ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్ స్పాన్సర్ చేశారు. గెలిచిన జట్టుకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, ఎస్సీ సెల్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్, మార్గం మల్లేశం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో, ఎంపీటీసీ, మాజీసర్పంచ్ మంజుల

హుజూరాబాద్‌రూరల్: పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో కేతిరి వెంకట నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, వాటర్ బాటిళ్లు, పరీక్ష సామగ్రిని అందజేశారు. సుమారు రూ.నాలుగు లక్షల విలువ చేసే పరీక్ష సామగ్రిని నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేశారు. నిరుపేద విద్యార్థులకు చేయూతనందించేలా ఎంపీటీసీ సరిత జైపాల్‌రెడ్డిలు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంద మంజుల, హెచ్‌ఎం భూపతి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూమిపూజ


భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ రవీందర్, ఎంపీపీ వినీత

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో కుల సంఘాల భవనాలకు మంగళవారం జెడ్పీటీసీ రవీందర్, ఎంపీపీ వినీత భూమిపూజ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరై యాదవ, మున్నూరు కాపు, మాల, గంగిరెద్దుల సంఘాల భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కత్తుల రమేశ్, బండి చేరాలు, తోట శ్రీనివాస్, కాసర్ల మహేందర్, జంగం లింగయ్య, గంట సారయ్య, భిక్షపతి, రాజయ్య, మిట్టపల్లి మల్లేశం, కంది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, రైతులు

హుజూరాబాద్: సాగులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో సునీల్ కుమార్ అన్నారు. పట్టణ పరిధి కేసీ క్యాంపులోని రైతువేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సాగులో రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు సాగులో ఎదుర్కొంటున్న పలు సందేహాలను వ్యక్తపరచగా రాష్ట్ర వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పరిష్కారం చూపారు. ప్రతి మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సందేహాలు నివృత్తి చేస్తామని తెలిపారు. ఉద్యాన అధికారి ఐలయ్య, టీ ఫైబర్ సాంకేతిక సహాయకుడు లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు


క్రీడాకారులకు టీషర్టులు అందిస్తున్న శ్రీనివాస్

గన్నేరువరం: యువత క్రీడలను సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యం వైపు కొనసాగాలని మాదాపూర్ డీసీఎంఎస్ నిర్వాహకులు మాదిరి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా మాదాపూర్ జట్టు లోగోతో కూడిన టీషర్టులను అందజేశారు. క్రీడలు మానసికోల్లాసం, దేహ ధార్యుడానికి ఎంతో ఉపయోగపడుతాయని, ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని, పోటీల్లో క్రీడా స్ఫూర్తి ప్రదర్శించినప్పుడే మంచి గుర్తించి లభిస్తోందన్నారు. క్రీడాకారులకు భవిష్యత్‌లో తనవంతు సహాయం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, సురేశ్, మనోజ్‌కుమార్, ప్రసాద్, మహేశ్, సుధాకర్,అరవింద్,రాజు, ప్రవీణ్, కిట్టు ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్



రామడుగు: మండలంలోని గుండి గ్రామ శివారులో మంగళవారం రాత్రి ఎస్సై మామిడాల సురేందర్ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్, వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ, రాగంపేట, రెవెల్లి, దేశాయిపేట గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం ప్రారంభించారు. పనుల్లో నాణ్యతా పాటించాలని, అధికారుల పర్యవేక్షణలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, నాయకులు పద్మాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిగౌడ్, కృష్ణారెడ్డి, తిరుపతి, సునంద, రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

లస్మన్నపల్లిలో ఎన్ఎస్ఎస్ శిబిరం


శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

సైదాపూర్: సింగాపూర్ వీఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా మండలంలోని లస్మన్నపల్లిలో మంగళవారం రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు తొలగించారు. గ్రామంలోని సమస్యలు గుర్తించి వాటిపై అవగాహన, సామాజిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతి తెలిపారు. ఈకార్యక్రమంలో కోమల, హరీశ్, విజయ్, వలంటీర్లు ఉన్నారు.

తైబజార్ కేటాయింపు


రాజేశ్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కౌన్సిలర్లు

హుజూరాబాద్: 2024–2025 సంవత్సరానికి తైబజార్‌ను గుడ్డేలుగుల రాజేశ్‌కు కేటాయించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక తెలిపారు. మంగళవారం రాజేశ్‌కు తైబజార్ లైసెన్స్ అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజారామ్మోహన్‌రాయ్, కౌన్సిలర్లు ముక్క రమేశ్, వెంకట్‌రెడ్డి, ముత్యంరాజు, నాయకులు ప్రతాపకృష్ణ, గోవిందుల భాస్కర్, భాషబోయిన సదానందం తదితరులు పాల్గొన్నారు.

కదనభేరికి తరలిన బీఆర్ఎస్ నాయకులు

రామడుగు: కరీంనగర్ కదనభేరికి మండలంలోని పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు సింగిల్ విండో చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

జమ్మికుంట: కదనభేరి సభకు జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్,పీఏసీఎస్ చైర్మన్ టి సంపత్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

మద్యం పట్టివేత

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా అమ్ముతున్న మద్యం పట్టుకొని, కేసులు నమోదు చేసినట్లు హుజూరాబాద్ సీఐ బొల్లం రమేశ్ మంగళవారం తెలిపారు. హుజూరాబాద్, కొత్తపల్లి తుమ్మనపల్లి గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి మద్యం బాటిళ్లు అమ్ముతున్న వారిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు సీఐ రమేశ్ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని సీఐ పేర్కొన్నారు.

16 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఏఎస్సై అనంతరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రోజులాగే పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటిలో తనిఖీ చేయడంతో నిల్వ చేసిన బియ్యం స్వాధీనం చేసుకొని విచారణ జరిపి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సురేందర్ తెలిపారు.

బైక్ చోరీ.. గట్టుదుద్దెనపల్లిలో వదిలిపెట్టిన దొంగలు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన బత్తిని వేణు బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో వదిలేసిపోయారు. ఈ నెల 9న ఇంటి ముందు బైక్‌ను పార్కింగ్ చేసి తెల్లారి చూసేవరకు బైక్ కనిపించలేదు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మంగళవారం గట్టుదుద్దెనపల్లి శివారులోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో బైక్‌ను వదిలేయగా నంబర్‌ప్లేట్‌పై బత్తిని అని రాసి ఉండటంతో గీత కార్మికులు పోలీసులకు సమాచారం అందించారు. బైక్ కనిపించిన సమాచారాన్ని పోలీసులకు అందించారు. మండలంలో విద్యుత్ మోటార్లు, చోరీకి గురైన వస్తువులు ఒక్కటి కూడా లభించలేదు. బైక్ మూడు రోజుల్లో కనిపించడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

చింతచెట్టు పైనుంచి పడి ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో మంగళవారం చింతచెట్టు పైనుంచి పడటంతో రైతుకు తీవ్రగాయాలయ్యాయి. గొల్లపల్లి గ్రామానికి చెందిన బోనాల కొంరయ్యకు మొలంగూర్ శివారులో వ్యవసాయభూములున్నాయి. చెట్టు ఎక్కి చింతకాయలు తెంపుతుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు.

బీమా చెక్కులు అందజేత


చెక్కులు అందజేస్తున్న మేనేజర్ ప్రభుదాస్

తిమ్మాపూర్: జీవిత బీమాతో పాటు ఆరోగ్య బీమా తీసుకుంటే ధీమాగా ఉండవచ్చని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ప్రభుదాస్ అన్నారు. చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్‌లో ఖాతాదారులు బరిగల తిరుపతి, ముంజ అనిత ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకం కింద వారి కుటుంబాలకు రూ. రెండు లక్షల బీమా డబ్బులు వచ్చాయని తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు మంగళవారం చెక్కులు అందించారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, సురక్ష బీమా పథకం కలిగి ఉండాలన్నారు. బ్యాంకు డిజిటలైజేషన్‌తోపాటు మొబైల్ బ్యాంకింగ్ సేవలు గూర్చి వివరించారు. బ్యాంక్ మేనేజర్ అరుణ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ స్వాతి, క్యాషియర్ చైతన్య, తిరుపతి ప్రోగ్రామ్ కన్వీనర్ శ్రీనివాస్, మహిళా సంఘాల సీఏలు, సభ్యులు సదానందం, వేణుగోపాల్, చిలువేరు వెంకటేశ్, పైడిపల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

జమ్మికుంట: మండలంలోని తనుగుల గ్రామంలోని సబ్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సదస్సును సద్వినియోగం చేసుకోవాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ వరంగల్, ఎఫ్ఏసీ చైర్‌పర్సన్ తిర్మల్‌రావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, లో వోల్టేజీ సమస్యలు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీస్ పేరు, మీటర్ల మార్పు, బిల్లులు ఎక్కువ రావడం వంటి సమస్యలపై వినియోగదారుల రాతపూర్వకంగా ఫిర్యాదు సమస్యలను పరిష్కరిస్తామని, వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చొప్పదండి: తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ ఈ నెల 9 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మండంలోని రాగంపేటకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి టి.విశాల్ రాష్ట్ర స్థాయిలో మూడోస్థానంలో నిలిచాడు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో జరిగిన సమావేశంలో హెచ్ఎం లచ్చయ్య విద్యార్థికి మెరిట్ సర్టిఫికెట్ అందజేశారు. పవర్ లిఫ్టింగ్‌లో 53 కిలోల విభాగంలో విద్యార్థి పతకం సాధించగా పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పాట్నా ఎక్స్‌ప్రెస్‌కు జమ్మికుంటలో హాల్టింగ్

జమ్మికుంట: సికింద్రాబాద్ నుంచి దానాపూర్ వెళ్లే పాట్నా ఎక్స్‌ప్రెస్ జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో బుధవారం నుంచి ఆపేందుకు కృషి చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి మంగళవారం ప్రాంత ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఏళ్ల తరబడి దూర ప్రాంతాలకు వెళ్లడానికి కొన్ని రైళ్లు ఆగేవి కాగా దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ఆగడం వల్ల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వేముల రాజశేఖర్‌రెడ్డి, కొత్తగట్టు రాజేశ్, మడిపల్లి అశోక్, మేకమల్ల రత్నం, సంగ పోచయ్య యాదవ్, మురహరి రాజు పాల్గొన్నారు.

పెరుక కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

మానకొండూర్: పెరుక కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర కేబినేట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. కార్పొరేషన్ ఏర్పాటు పట్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మీస సత్యనారాయణ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉక్కపోత.. ఉక్కిరిబిక్కిరి



శంకరపట్నం: మండలంలోని లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో పిల్లలు ఉక్కపోతలో విద్యాభ్యాసం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించినప్పటినుంచి ఇప్పటివరకు అధికారులు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయలేదు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పిల్లలు ఉక్కపోత భరించలేకపోతున్నారు. దాతలు సీలింగ్ ఫ్యాన్‌లు అందించినప్పటికీ విద్యుత్ కనెక్షన్ లేక నిరుపయోగంగా ఉన్నాయి. మంచి నీటి సౌకర్యం లేకపోవడంతో పిల్లలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే విద్యుత్ కనెక్షన్ అందించాలని గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నియామకం


నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన పాంద్రాల కనక రాజేశంను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు రాజేశం కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ రాజయ్య, ఎంపీటీసీ నర్సింగారావు, కుమార్, మొగలి హర్షం వ్యక్తం చేశారు.

టెక్నికల్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజేందర్

హుజూరాబాద్: టెక్నికల్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన చిమ్ముల రాజేందర్ మంగళవారం ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సత్యానందం, ఉపాధ్యక్షుడిగా దుంపెట్టి శ్రీనివాస్, బైరవేని అశోక్, పద్మ, ఎర్రవెల్లి వెంకటేశ్, కోశాధికారిగా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా చిరుత హరీశ్, గౌరవ అధ్యక్షుడిగా గాలిపెల్లి జగదీశ్, ముఖ్యసలహాదారుడిగా మమత నియామకమయ్యారు.

కేసీఆర్‌ను కలిసిన రావుల, తుమ్మనపల్లి


మాజీ సీఎం కేసీఆర్‌ను శాలువాతో సన్మానిస్తున్న రావుల రమేశ్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు

తిమ్మాపూర్: కరీంనగర్ కదనభేరి కార్యక్రమానికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తిరుగు ప్రయాణంలో మండలంలోని ఎల్ఎండీ గెస్ట్ హౌస్‌లో కొద్దిసేపు సేద తీరారు. అనంతరం నుస్తులాపూర్ మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, జిల్లా నాయకుడు రావుల రమేశ్, తుమ్మనపల్లి శ్రీనివాసరావుతో కాసేపు ముచ్చటించారు. బాగున్నారా రమేశ్, శ్రీను అంటూ సీఎం కేసీఆర్ పలకరించారు. కరీంనగర్ ఎంపీగా వినోద్ కుమార్ గెలుపునకు కృషి చేయాలని, మండలంలోని నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం శ్రీనివాసరావు, రమేశ్ కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, మండలంలోని నాయకులు పాల్గొన్నారు.

ఇతరులను కించపరిచేలా మాట్లాడొద్దు


కవాతు చేస్తున్న పోలీసులు

శంకరపట్నం: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కేశవపట్నం, వంకాయగూడెం, గ్రామాల్లో పోలీసులు సాయుధ బలగాలతో మంగళవారం కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... ఎన్నికల సందర్భంగా రాజకీయ నాయకులు సమావేశాలకు అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రసంగాలు, సోషల్ మీడియాల్లో ఇతరులను కించపరిచే విధంగా మాట్లాడవద్దన్నారు. ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ వెంకటి, ఎస్సైలు లక్ష్మారెడ్డి, ఆరోగ్యం పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

చొప్పదండి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని, లక్ష్య సాధనకు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం వైద్యుల రాజిరెడ్డి అన్నారు. పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఫలితాల్లో పది జీపీఏ సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని మాజీ జెడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య ప్రకటించారు. కార్యక్రమంలో రబియా, జలపతి, జలీల్, పుష్పలత, శారద, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీ శ్రీఆండాళ్, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 45వ అధ్యయన బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు వివిధ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆరగింపు అనంతరం తీర్థప్రసాదాలు ఆలయ అర్చకులు గోవర్ధన వేంకటాచార్యులు, శ్రీకాంతాశేషాచార్యులు అందించారు. యజ్ఞాచార్యులు శ్రీకాంత్ చార్యులు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పాటు ప్రత్యేక పూజ చేశారు. భక్తులు పాల్గొని స్వామివారి విశిష్టతను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి ఒంటెల రవీందర్‌రెడ్డి , కోశాధికారి పోలు కిషన్, మాజీ చైర్మన్ మామిడి రమేశ్, బట్టు కర్ణాకర్, రమేశ్, మారం రమాదేవి, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు

వీణవంక: మండల కేంద్రానికి చెందిన నీల సాయికిరణ్ అనే వ్యక్తి ప్రేమ వివాహం చేసుకొని కొద్ది రోజులుగా మానసికంగా వేధిస్తున్నాడని మంచిర్యాల జిల్లా నస్పూరుకాలనీకి చెందిన ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉద్యోగముందని మాయమాటలు చెప్పి వివాహం చేసుకున్నాడని, రెండు నెలలుగా మద్యం తాగుతూ ఉద్యోగం చేయకుండా కట్నం తేవాలని వేధిస్తూ కులంపేరుతో దూషిస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తిరుపతి తెలిపారు.